

సోమశిలలో 67.380 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం నాటికి 67.380 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 25,822 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,10,750
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,945
3 శాతం జీఎస్టీతో	రూ.10,243
నవర (8 గ్రా)	రూ.81,944

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.7 /28.2

జిల్లాలో ఆదివారం వాతావరణం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. శనివారం గాలిలో తేమ 44 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

నెల్లూరు (పొగతోట): ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయీమెంట్ కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 8న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నెల్లూరు ప్రభుత్వ (బాలుర) ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్‌ఖయ్యూం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 ప్రముఖ కంపెనీల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కల్పిస్తామన్నారు. జిల్లాలో 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9494456326, 8712655686, 8790118349 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డీకేడబ్ల్యూలో ‘నానీ ట్రైనింగ్’ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15వ తేదీ నుంచి ‘నానీ ట్రైనింగ్’ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి ఆధునిక సమాజంలో కుటుంబంలోని తల్లిదండ్రులు వారి వృత్తుల కారణంగా పిల్లల సంరక్షణకు సరైన సమయాన్ని కేటాయించడం లేదన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పిల్లల సంరక్షణకు ఎంతైనా అవసరం ఉందని, ఆ ఆవశ్యకతకు అనుగుణంగా గృహ విజ్ఞాన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏడాది పాటు ‘నానీ ట్రైనింగ్’ సర్టిఫికెట్‌ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కోర్సుకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి 40 ఏళ్లలోపు మహిళలు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9494495494, 9182323406 నంబరులో సంప్రదించాలన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో కీలకమైన సచివాలయ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా శనివారం ఉదయగిరి మండలంలో సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆయా కార్యాలయాల ముందు నిరసన వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగుల కమిటీ నేతలు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని ప్రభుత్వం మరింత దిగజారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వలంటీర్లు చేసే పనులను తమతో చేయిస్తూ ఉద్యోగ విధుల్లో ఒత్తిడి పెంచుతున్నారని ఆరోపించారు. మనస్సు చంపుకుని గత్యంతరం లేక సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం ఇంతటి దారుణంగా పనిభారం పెంచడం దుర్మార్గమైన చర్యగా ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పనిభారం తగ్గించి తమ సమస్యలు పరిష్కరించాని డిమాండ్ చేశారు. లేకపోతే దశల వారీగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

మైనింగ్ పనుల పరిశీలన



మైనింగ్‌పై ఆరా తీస్తున్న అధికారులు

వరికుంటపాడు: మండలంలోని వరికుంటపాడు భాస్కరపురం, కనియంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 233/1లో మైనింగ్ పరిమితులు నిలుపుదల చేయాలని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నెల్లూరు అధికారులకు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా అనలిస్ట్ బి.హరిబాబు తన బృందంతో వచ్చి శనివారం సంబంధిత మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. వారి వెంట సర్పంచ్ కొండెపోగు దిలీప్‌కుమార్, బీజేపీ స్టేట్ మాజీ కార్యవర్గ సభ్యుడు ఆంద్రా పరంధామిరెడ్డి, కన్స్యూమర్ హ్యూమన్ రైట్స్ స్టేట్ కన్వీనర్ చల్లగాలి వెంకటమోహన్ ఉన్నారు.

మాలకొండకు రూ.8,35,831 రాబడి

వలేటివారిపాళెం: మండలంలోని మాలకొండలో కొలువైన మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం శనివారం ఒక్క రోజే రూ.8,35,831 రాబడి వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ కుంకుమార్చన టికెట్ల ద్వారా రూ.19,560, తలనీలాలు రూ.47,875, ప్రత్యేక దర్శనం రూ.3,07,800, రూమ్ అద్దెలు రూ.31,990, లడ్డూ ప్రసాదాలు రూ.1,72,425, అన్నదానం రూ.2,31,791 ఇతర విరాళాలు కలిపి రూ.8,35,831 వచ్చినట్లు తెలిపారు.

టీడీపీలో కాలువ కయ్యం

- మాలేపాటి మాటలు, దగుమాటి మంటలు
- డీఆర్ చానల్ ఆధునీకీకరణ పనుల్లో ఎమ్మెల్యే అక్రమాలు
- సీఎంకు ఫిర్యాదు చేసిన సుబ్బానాయుడు
- విచారణకు ఆదేశిస్తానని హామీ
- రగులుతున్న శాసనసభ్యుడి అనుచరులు



ఆ ఇద్దరూ టీడీపీలో కీలక నేతలు. ఒకరు ఎమ్మెల్యే దగుమాటి. మరొకరు రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి. ఎన్నికల ముందు కలిసి మెలిసి ఉన్నా.. తర్వాత ఇద్దరి మధ్య పరిస్థితి నిప్పు, ఉప్పు అన్నట్లుగా మారింది. దగుమాటి ఏకంగా మాలేపాటిపై క్రిమినల్ కేసులు పెట్టించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొంత కాలం మౌనంగా ఉన్న మాలేపాటి తనకు పదవి రావడంతో ఎమ్మెల్యేతో ‘సై’ అంటూ ఆయనపై అవినీతి ఆరోపణలు చేసి సంచలనం సృష్టించారు. ఏకంగా సీఎం చంద్రబాబుకే ఎమ్మెల్యే దగుమాటి అక్రమాలపై ఫిర్యాదులు చేయడంతో అధికార పార్టీ నేతల మధ్య పరిస్థితి పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. పరస్పర వర్గాల ఆరోపణలు, విమర్శలు, హెచ్చరికలతో అంతర్యుద్ధం జరుగుతోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కావలి టీడీపీలో ముఖ్య నేతల కలహాలు తార స్థాయికి చేరాయి. మొన్నటికి మొన్న ఎమ్మెల్యే కావ్య అనుచర వర్గం సాగిస్తున్న గ్రావెల్ అక్రమ రవాణాపై బహిరంగంగానే ధ్వజమెత్తిన రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, తాజాగా దగదర్తి–రాచర్లపాడు చానల్ ఆధునీకీకరణ పనుల్లో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అవినీతిపై ఏకంగా సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేయడంతో ఆ పార్టీలో కలకలం సృష్టిస్తోంది. స్థానిక కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై కాలువ లైనింగ్ పనులు మార్చేశారని, ఆయకట్టు రైతులు నష్టపోతున్నారనని ఆయన మీడియా ముందుకు రావడంతో పార్టీలో లుకలుకలు బయటపడ్డాయి.

కావ్యతో మాలేపాటి ఢీ అంటే ఢీ

ఈ క్రమంలో బీదకు ఎమ్మెల్సీ పదవి రావడంతో మాలేపాటికి కొంత ఊపిరి వచ్చింది. పార్టీ అధిష్టానం వద్ద బీదకు ఉన్న పరపతితో మాలేపాటికి రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ పదవి ఇప్పించారు. అయినప్పటికీ మండల స్థాయిలో తన వర్గానికి అధికారులు ఏ చిన్న పని కూడా చేయకుండా ఎమ్మెల్యే హుకుం చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యేతో ఢీ కొట్టేందుకు సిద్ధపడ్డారు. ఇటీవల ఎమ్మెల్యే అనుచర వర్గం గ్రావెల్ అక్రమ రవాణాపై బహిరంగ ఆరోపణలు చేయడంతోపాటు తన వర్గం మట్టి తోలుకుంటుంటే అడ్డగించిన అధికారులతోనే వైరివర్గం యంత్రాలను సీజ్ చేయించడంతో ఆ పార్టీ నేతల మధ్య అంతర్యుద్ధం ప్రారంభమైంది.

సీఎంకు ఫిర్యాదుతో టీడీపీలో కలకలం

తాజాగా డీఆర్ చానల్ డిజైన్ మార్పు విషయంలో సీఎం చంద్రబాబుకు మాలేపాటి ఆధారాలు, ఫొటోలతో సహా ఫిర్యాదు చేయడంతో ఆ పార్టీలో కలకలం రేగింది. వర్క్ డిజైన్ మార్పుతో స్థానిక ఎమ్మెల్యే హస్తం ఉందని ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

డీఆర్ చానల్ వేదికగా రచ్చ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.26 కోట్లతో దగదర్తి–రాచర్లపాడు చానల్ ఆధునీకీకరణ పనులు మంజూరయ్యాయి. అయితే ఆ పనిని నెల్లూరుకు చెందిన కాంట్రాక్టర్ దక్కించుకుని సబ్ కాంట్రాక్టర్‌కు పని అప్పగించారు. ప్రస్తుతం కొంత భాగం పనులు కూడా పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం రాకతో ఆ పనుల డిజైన్ మార్చేసి నిధులు పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపణలున్నాయి. కాలువ లైనింగ్, పూడిక తీతతో పాటు, రెండు చోట్ల సైఫన్ల నిర్మాణం చేయాల్సి ఉంది. అయితే ఎస్టిమేషన్‌లో ఉన్న సైఫన్‌లు నిర్మించాల్సి ఉన్నా.. స్థానిక ఎమ్మెల్యే అందులో రెండు తొలగించి చేపడుతున్నారనే మాలేపాటి ఆరోపణలు. దీని వల్ల వరద నీరు వెళ్లే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఎస్టిమేషన్‌లో పొందుపరిచిన విధంగా కాకుండా డిజైన్ మార్చేయడంతో దగదర్తి రైతులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని మాలేపాటి చెబుతున్నారు. ఈ వ్యవహారం వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందని బహిరంగంగా మీడియా ముఖంగా ఆరోపణలు చేయడంతో సంచలనం రేపింది. రెండు వంతెనల నిర్మాణం నిలిపివేసి నిధులు పక్కదారి పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని మాలేపాటి విమర్శలు చేస్తుంటే.. వాగు పోరంబోకు భూములను ఆక్రమించుకుని, కమీషన్ల కోసమే అభివృద్ధి పనులు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే అనుచర వర్గం ఆరోపిస్తోంది.

పదవి రాగానే పగ..

ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అనుచరుడిగా పార్టీలో క్రియాశీలకంగా ఉన్న మాలేపాటి గత ఎన్నికలకు ముందు వరకు పార్టీని నడిపించారు. 2019 ఎన్నికల తర్వాత పార్టీని టీడీపీ నేతలు వదిలేసినా ఆ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచి రూ.కోట్ల ఖర్చు పెట్టుకుని ఎన్నికల ముందు కాడెనెత్తుకుని పార్టీ కోసం కష్టపడ్డారు. కానీ టీడీపీ అధినేత మాలేపాటికి ఝలక్ ఇచ్చి వైఎస్సార్‌సీపీ నేతగా ఉన్న దగుమాటిని పార్టీలో చేర్చుకుని టికెట్ ఇచ్చారు. బీద కూడా తన అనుచరుడికి అన్యాయం చేసినట్లేనని అప్పట్లో పార్టీ వర్గాలు మండిపడ్డాయి. అయినప్పటికీ పార్టీ విజయం కోసం పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా దగుమాటి వెంకటకృష్ణారెడ్డి విజయం సాధించడంతో రాజకీయంగా మరో వ్యక్తి తనకు అడ్డుగా ఉండకూడదని భావించారు. మాలేపాటి వర్గాన్నే కాకుండా.. ఏకంగా ఆయన్నే టార్గెట్ చేశాడు. నియోజకవర్గ నాయకుడి నుంచి గ్రామ స్థాయి కార్యకర్తగా మార్చేశారు. మాలేపాటి వర్గం అని చెప్పుకునేందుకు కార్యకర్తగా ముందుకు వచ్చే పరిస్థితి లేదు. ఆయన చెబితే గ్రామస్థాయి వీఆర్వో కూడా పనిచేయని పరిస్థితి. ఈ క్రమంలో మాలేపాటిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించడానికి సైతం ఎమ్మెల్యే వెనుకాడలేదు. ఈ క్రమంలో దగదర్తి మండలంలో మాలేపాటికి వ్యతిరేక వర్గం ఉన్న పమిడి రవికుమార్‌చౌదరిని ప్రోత్సహిస్తూ రావడంతో పార్టీలో ఘోర అవమానాలు ఎదుర్కోవాల్సి వచ్చింది.

అన్నం పెట్టే రైతులపై కూటమి రాక్షసత్వం

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 9న అన్నదాతపోరు
- పోస్టర్ ఆవిష్కరించిన మాజీ మంత్రి కాకాణి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆది నుంచి రాక్షసత్వం ప్రదర్శిస్తోందని, ఎరువులు అడిగితే ముఖ్యమంత్రి, మంత్రి రైతులను, వైఎస్సార్‌సీపీ నేతలను పశువులతో పోల్చుతూ మాట్లాడడం అందుకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. రైతుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 9న ఆర్డీఓ కార్యాలయాల వద్ద అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నా నిర్వహించి ఆర్డీఓలకు వినతిపత్రం అందజేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ‘అన్నదాత పోరు’ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో ఎరువుల కొరత ప్రధాన సమస్యగా ఉందని, రైతులు క్యూలో నిలబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విత్తనాల కోసం క్యూలో నిలబడాల్సిందేనని, చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇది కామన్ అన్నారు. రైతులకు చెందాల్సిన యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలించేసి కృత్రిమ సంక్షోభం సృష్టించారని, వ్యవసాయశాఖ మంత్రి దీన్ని పట్టించుకోకుండా రైతులపై చులకనగా మాట్లాడుతున్నారు. ఇది సిగ్గుచేటన్నారు. అటు యూరియాను బ్లాక్ మార్కెట్లో ఎక్కువ ధరకు కొనాల్సిన పరిస్థితి ఉందన్నారు. అసలు ఆర్బీకేల ద్వారా ఎరువులు, యూరియా ఎందుకు ఇవ్వడం లేదనేది చెప్పాలన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాకాణి, కిలివేటి, విజయకుమార్‌రెడ్డి, తదితర పార్టీ ముఖ్య నేతలు

ఎడగారు కోతలు.. దోపిడీలో దళారులు

జిల్లాలో ఎడగారు కోతలు మొదలయ్యాయని, ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ప్రవేశించి తక్కువ ధరకు ధాన్యాన్ని దోచుకుంటున్నారన్నారు. జిల్లాలో పుట్టి ధాన్యానికి గిట్టుబాటు ధర రూ.19,770 ఉంటే దాని కంటే తక్కువగా అమ్ముకుని రైతులు నష్టపోతున్నారన్నారు. ఫలితంగా రైతులు ఒక పుట్టిపై రూ.4 వేలు నష్టపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఎడగారు కోతలతో వస్తున్న ధాన్యాన్ని మద్దతు ధరతో ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, వైఎస్సార్ తెచ్చిన ఉచిత విద్యుత్ , జగన్ అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాలను కూటమి ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి 54 లక్షల మంది రైతులకు రైతు భరోసా అందిస్తే చంద్రబాబు 46 లక్షల మందికే అన్నదాత సుఖీభవ పథకాన్ని పరిమితం చేశారన్నారు. చంద్రబాబు మొదటి విడత ఎగ్గొట్టి, రెండో విడతలో 8 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ ఎగనామం పెట్టారన్నారు. అన్నదాతలందరికి ఈ పథకాలు వర్తించేలా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకుని అన్నదాత సుఖీభవను రైతులందరికీ వర్తింపచేయాలని, అధిక వడ్డీలతో పెట్టుబడి తెచ్చుకుంటున్న రైతులను ఆదుకుని బాసటగా నిలవాలన్నారు. ఈ డిమాండ్లపై ఈ నెల 9వ తేదీన ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కందుకూరు, కావలి, ఆత్మకూరు, నెల్లూరు, గూడూరు, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్లలో నిరసన ర్యాలీలు చేపట్టి ఆర్డీఓ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీఓలకు వినతులు సమర్పించు రైతు సమస్యలను వివరిస్తామన్నారు. వైసీపీ శ్రేణులందరూ ఈ నిరసనలో పాల్గొని రైతులకు అండగా నిలబడాలని పిలుపునిస్తున్నామని, దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే తదుపరి కార్యాచరణకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

నిరంతరాయంగా యూరియా సరఫరా

- కలెక్టర్ ఆనంద్



కలెక్టర్ ఆనంద్

నెల్లూరురూరల్: జిల్లాలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిరంతరాయంగా యూరియాను సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 2,471 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. రాబోయే 10 రోజుల్లో మరో 500 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నట్లు చెప్పారు. రైతులు ఆధార్ విధానం ద్వారా యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఎవరైనా అధిక ధరలకు యూరియా అమ్మితే సమీపంలో ఉన్న మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు. యూరియాకు ఇబ్బందులు పడుతుంటే టోల్ ఫ్రీ నంబరు 8331057285లో సంప్రదించాలని, రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా, యూరియాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

పేదల బియ్యం.. తమ్ముళ్ల వ్యాపారం

- మంత్రి ఆనం ఇలాకాలో రేషన్ బియ్యం మాఫియా
- అక్రమ రవాణాకు అడ్డాగా వెంగంపల్లి
- మాఫియా డాన్లుగా మహేష్ రెడ్డి, వంశీకృష్ణ, హజరత్ రెడ్డి
- 80 బస్తాలను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్న మీడియా
- మామూళ్ల మత్తులో సంబంధిత అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: టీడీపీ నేతలు ధనదాహంతో బరితెగిస్తున్నారు. పేదల కడుపులు కొట్టి.. తమ బొక్కసాలు నింపుకుంటున్నారు. పేద ప్రజల ఆకలి తీర్చేందుకు కేంద్ర భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వ సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని అధికార పార్టీ నేతలే దోచుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో మంత్రి ఆనం ఇలాకా ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం మండలంలో టీడీపీ నేతలు మాఫియాగా మారారు. ప్రధానంగా ఆ మండలంలోని వెంగంపల్లి అడ్డాగా అక్రమ రవాణా సాగిస్తున్నారు.

నెల మొదటి వారంలోనే ఖాళీ

అనంతసాగరం మండలంలో సుమారు 13,600 రేషన్ కార్డులు ఉండగా, సుమారు 340 టన్నుల బియ్యం సరఫరా అవుతోంది. అయితే ఇందులో 90 శాతం బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని తెలుస్తోంది. గత నెల మొదటి వారంలో ఈ మండలం నుంచి మినీ వాహనంలో కోవూరు సమీపంలోని ఓ రైస్‌మిల్లుకు తరలిస్తుండగా సుమారు 13 టన్నుల బియ్యం పట్టుబడిన విషయం విదితమే.

రూ.15లకు కొని.. రూ.20 అమ్మి..

మండలంలోని పలు రేషన్ డీలర్లు లబ్ధిదారులకు కిలో రూ.15 నగదు ఇచ్చి బియ్యాని కొనుగోలు చేసి మాఫియాకు కిలో రూ.20 వంతున అమ్ముకుంటూ అక్రమానికి పాల్పడుతున్నారని గ్రామాల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా మాఫియాకు సహకరించని డీలర్ల పరిధిలోని కార్డుదారుల వద్దకే మాఫియా మనుషులే నేరుగా వెళ్లి బియ్యాని కొనుగోలు చేస్తున్నారనేది జగద్విదితమే.



పట్టుబడిన రేషన్ బియ్యం వాహనంతో అధికారులు

తాజాగా ఈ నెల 3వ తేదీ 250 బస్తాలు 17.5 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడగా, శనివారం 80 బస్తాలు 6 టన్నుల బియ్యం పట్టుబడింది. దీన్నిబట్టి ఏ స్థాయిలో జరుగుతుందో స్పష్టమవుతోంది. ప్రతి నెలా 31వ తేదీకి ముందే రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. 1వ తేదీ నుంచి కార్డుదారులకు సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే కార్డుదారులకంటే ముందే రేషన్ మాఫియా అక్రమ మార్గంలో రైస్‌మిల్లులకు తరలించి పాలిష్ పట్టించి బ్రాండెడ్ బ్యాగుల్లో ప్యాక్ చేసిన నాణ్యమైన బియ్యంగా విక్రయిస్తున్నారు.

మంత్రి ఆనం ఇలాకాలోనే...

ప్రధానంగా మండలంలోని వెంగంపల్లి గ్రామాన్ని రేషన్ బియ్యం మాఫియాకు అడ్డాగా మారింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ముఖ్య అనుచరులైన గ్రామానికి చెందిన టీడీపీ నేతలు బుట్టి మహేష్‌రెడ్డి (ప్రధాన సూత్రధారి)అనుసంధానంతో యనమల వంశీకృష్ణారెడ్డి, హజరత్‌రెడ్డి మాఫియా డాన్లుగా మారారు. పొలాల్లోని గోడౌన్లలో నిల్వ ఉంచి రాత్రి వేళల్లో అధికారులు పచ్చ జెండా ఊపగానే నేరుగా నెల్లూరు, కావలి రైస్ మిల్లులకు తరలించి కిలో బియ్యాని రూ.35కు అమ్ముకుంటూ రూ.కోట్లు సొమ్ము చేసుకుంటున్నారని వెంగంపల్లిలో కోడై కూస్తోంది.

వాహనాన్ని అడ్డుకున్న విలేకరులు

మండలంలోని నల్లరాజుపాళెం కాలువ గట్టుపై వెంగంపల్లికి చెందిన టీడీపీ నేతలకు చెందిన అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఓ మినీవ్యాన్‌ను శనివారం స్థానిక విలేకరులు అడ్డుకొని సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. దీంతో సివిల్ సప్లయీస్, పోలీస్, రెవెన్యూ అధికారులు వాహనం వద్దకు వచ్చి వాహనాన్ని తనిఖీ చేయగా, 80 బస్తాల రేషన్ బియ్యం ఉండడాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో ఎంపికలు

కందుకూరు: వైఎస్సార్‌సీపీలోని పలు అనుబంధ విభాగాల జిల్లా స్థాయి కమిటీలకు కందుకూరు నియోజకవర్గానికి చెందిన పలువురిని ఎంపిక చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్‌సీపీ జిల్లా మున్సిపల్ విభాగ సెక్రటరీ, కార్యనిర్వాహక సభ్యులుగా నగళ్ల నారయ్య, పల్నాటి చెన్నయ్య, సయ్యద్ అసద్, పీతా రామకృష్ణ నియమితులయ్యారు. జిల్లా బూత్‌కమిటీ సెక్రటరీగా కట్టా శ్రీనివాసులు, కార్యనిర్వాహక సభ్యులుగా దామా రమేష్, పెయ్యల హరిబాబు, ఆవుల మాధవరావు ఎంపికయ్యారు. జిల్లా పబ్లిసిటీ విభాగ కమిటీ జిల్లా జనరల్ సెక్రటరీగా చింతలపూడి మోహన్‌రావు, సెక్రటరీగా కూరపాటి వెంకట్రామిరెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా పరిటాల సింగయ్య, మార్తాల రమణారెడ్డి, మట్టగుంట వెంకటేశ్వర్లు, అనంత చంద్రయ్యను నియమించారు. క్రిస్టియన్ మైనార్టీ విభాగ కమిటీ జిల్లా సెక్రటరీగా గోపనతోటి నర్సయ్య, కార్యనిర్వాహక సభ్యులుగా తాటిపర్తి రవి, కరేటి కోటేశ్వరరావు, ఎడ్లూరి దేవిడ్‌ను నియమించారు. జిల్లా స్టూడెంట్ వింగ్ కార్యనిర్వాహక సభ్యులుగా షేక్ ఆరీఫ్, డొక్కా జాన్ ప్రకాశ్‌లను నియమించారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులను నియమిస్తూ వారికి అసెంబ్లీ నియోజక వర్గాలను కేటాయిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కొడవలూరు ధనుంజయరెడ్డిని కనిగిరి, ఉదయగిరి నియోజకవర్గాలకు, కొండూరు అనిల్‌ను కోవూరుకు, పెళ్లకూరు సత్యనారాయణరెడ్డిని కందుకూరు, పేర్నాటి కోటేశ్వరరెడ్డిని సర్వేపల్లి, ఆత్మకూరుకు, చిల్లకూరు సుధీర్‌రెడ్డిలను నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలకు నియమించారు. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజనల్ కో ఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిస్తారని తెలిపారు.



10 నుంచి అండర్–19 జిల్లా స్థాయి పోటీలు

నెల్లూరు (టౌన్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు అండర్–19 జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి కృష్ణారెడ్డి, స్కూల్ గేమ్స్ అండర్–19 ఆర్గనైజింగ్ సెక్రటరీ పాటూరు వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 2007 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయన్నారు. ఆర్చరీ, ఫుట్‌బాల్, సైక్లింగ్ రోడ్ ట్రాక్, కరాటే, సాఫ్ట్ టెన్నిస్, జూడో, షూటింగ్, నెట్‌బాల్, టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, బీచ్ వాలీబాల్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్, వాటర్ పోలో, రగ్బీ, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్ డైవింగ్, స్కేటింగ్ తదితర పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయి పోటీలు స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతాయన్నారు.

క్లుప్తంగా

వేళాంగణిమాత మహోత్సవాలు ప్రారంభం



తోటపల్లిగూడూరు: కోడూరులో వేళాంగణి మాత ఉత్సవాలు అట్టహాసంగా శనివారం ప్రారంభమయ్యాయి. పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ లూకాస్‌రాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను జరిపారు. మరియమాత – రక్షణ సహకారిణి అనే అంశంపై భక్తులకు దైవ సందేశాన్ని పలువురు అందించారు. మరియమాత తేరు ప్రదక్షిణ కార్యక్రమాన్ని ముత్యాలతోపు మీదుగా మహాలక్ష్మీపురం వరకు సాగింది. ప్రార్థనల అనంతరం స్థానికంగా ఉన్న కోడూరు బీచ్‌లో సముద్ర స్నానాలను స్థానికులు ఆచరించారు.

ఉత్సవాల్లో నేడు

వేళాంగణి మాత ఉత్సవాల్లో భాగంగా ఉదయ కాల ప్రార్థన, ఆరాధన – స్వస్థత ప్రార్థనలు, దివ్య బలిపూజ, పరిశుద్ధ జపమాల తదితరాలను ఆదివారం నిర్వహించనున్నారు. వేళాంగణి చర్చి నుంచి కొత్తకోడూరు వరకు వేళాంగణిమాత విగ్రహ తేరుప్రదక్షిణ రాత్రి 8.30కు జరగనుంది.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. పొలం పనుల నిమిత్తం చిలకలమర్రికి బద్వేల్‌కు చెందిన వెంకటయ్య వచ్చారు. ఆలస్యం కావడంతో కలువాయిలోని తన సోదరుడు ఇంటికెళ్తుండగా, మార్గమధ్యలో ముస్తాపురం వద్ద గేదెలు అడ్డురావడంతో వాటిని ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను 108లో ఆత్మకూరులోని హాస్పిటల్‌కు.. ఆపై మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. సోమశిల పోలీసులు కేసు నమోదు చేశారు.

- వాహనం అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండల పరిధిలోని గౌరవరం వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. మర్రిపాడు మండలం సింగనపల్లికి చెందిన పెంచలయ్య గౌరవరానికి వచ్చి తిరిగెళ్తుండగా, గ్రామ శివార్లలో ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించసాగారు. ఈ క్రమంలో అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లడంతో స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని 108లో ఆత్మకూరు తరలించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ శనివారం అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. స్వామివారిని శుక్రవారం అర్ధరాత్రి వరకు 69,531 మంది దర్శించుకోగా, తలనీలాలను 31,439 మంది సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.49 కోట్లను భక్తులు సమర్పించారు. టైమ్ స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లోనే అవుతోంది.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.115
లేయర్	రూ.123
బ్రాయిలర్ చికెన్:	రూ.212
స్కిన్‌లెస్ చికెన్:	రూ.234
లేయర్ చికెన్:	రూ.210




గ్రామాల్లో స్థానిక సందడి

- మూడు నెలల ముందే సర్పంచ్ ఎన్నికలు • ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ • జనవరిలో నిర్వహణకు తాత్కాలిక షెడ్యూల్

సీతారామపురం: గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి అప్పుడే మొదలైంది. వీటికి సిద్ధం కావాలంటూ పంచాయతీ రాజ్ శాఖకు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ లేఖలు రాసిన తరుణంలో ముందస్తుగా వెళ్లాలనే యోచనలో కూటమి ప్రభుత్వం ఉందని తెలుస్తోంది. దీనికి తగిన విధంగా జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది.

కసరత్తు షురూ..

వాస్తవానికి సర్పంచ్‌ల పదవీ కాలం వచ్చే ఏడాది ఏప్రిల్‌తో ముగియనుంది. అయితే మూడు నెలల ముందే ఎన్నికల నిర్వహణకు చట్టంలో ఉన్న వెసులుబాటు మేరకు కసరత్తును ప్రారంభించింది. తాత్కాలిక షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేయడంతో గ్రామాల్లో రాజకీయ సందడి మొదలైంది.



ఆశావహులపై అప్పుడే చర్చ

సర్పంచ్ స్థానాలు, వార్డుల్లో ఎవరు పోటీ చేయాలనే అంశంపై అప్పుడే చర్చ జోరందుకుంది. జిల్లాలో 940 పంచాయతీలు.. 10,741 వార్డులున్నాయి. జిల్లాలో సుమారు 33.25 లక్షల జనాభా ఉండగా, వీరిలో 24,03,026 మంది ఓటర్లుగా ఉన్నారు. గడువుకు ముందే ఎన్నికల నిర్వహణకు వీలుగా కార్యకలాపాలను పూర్తి చేయాలని అధికార యంత్రాంగాన్ని ఎస్‌ఈసీ అప్రమత్తం చేసింది. తాత్కాలిక షెడ్యూల్ మేరకు వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియను అక్టోబర్ 15లోపు.. వార్డుల వారీగా ఓటర్ల జాబితాను అదే నెల 16 నుంచి నవంబర్ 15లోపు సిద్ధం చేసి ప్రచురించాల్సి ఉంది. ఎన్నికల అధికారులను నవంబర్ 15లోపు నియమించాలి. ఆపై పోలింగ్ కేంద్రాలను నవంబర్ 16 నుంచి 30లోపు ఖరారు చేయడం తదితరాలను పూర్తి చేయాల్సి ఉంది. రిజర్వేషన్లను డిసెంబర్ 15లోపు ఖరారు చేసి అదే నెల చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశాలను నిర్వహించాలి. వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్‌ను ఇచ్చి, ఫలితాలను అదే నెల్లో ప్రకటించాలి.

సజావుగా సాగేనా..?

రెడ్‌బుక్ పేరిట క్షేత్రస్థాయిలో ఏకగ్రీవం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల నిర్వహించిన ఉప ఎన్నికల్లో కూటమి నేతలు ఎలా బెదిరింపులకు పాల్పడ్డారో అందరికీ తెలిసిన విషయమే. ఏ పార్టీ మద్దతుదారులకు సర్పంచ్‌గా కూటమి పార్టీలు అవకాశమిస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.

చికెన్ వ్యర్థాల వాహన అడ్డగింత



ముత్తుకూరు(పొదలకూరు): చికెన్ వ్యర్థాల వాహనాన్ని మండలంలోని తాళ్లపూడి పంచాయతీ బసరాలదిబ్బలో గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. దుర్గంధాన్ని భరించలేకపోతున్నామంటూ వాహనాన్ని అధికార పార్టీ నేతలే అడ్డుకొని పోలీసులకు సమాచారమిచ్చారు. చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు గానూ బెంగళూరు నుంచి కోళ్ల వ్యర్థాలను పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. ఈ ప్రాంతానికి వాహనం ప్రతి శుక్రవారం రాత్రి వచ్చి శనివారం వెళ్తోంది. వాహన రాకను గ్రామస్తులు గమనించి, దాన్ని అడ్డుకొని ఆందోళనను చేపట్టారు. ఈ ప్రాంతానికి రాకుండా కట్టడి చేయాలని కోరుతూ పోలీసులకు సమాచారమిచ్చారు.

హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నగరంలోని ఏసీఎస్సార్ మెడికల్ కళాశాల, ప్రభుత్వ వైద్యశాల కమిటీ మహాసభను శనివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనంగా రూ.26 వేలను చెల్లించాలని కోరారు. పీఆర్సీని తక్షణమే ప్రకటించి.. మధ్యంతర భృతిని ఇవ్వాలన్నారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన కమ్మటి శ్రీనివాసులు, కవి మోపూరు పెంచలనరసింహాన్ని సత్కరించారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నరమాల సతీష్ కుమార్, గౌరవ సలహాదారుగా కమ్మటి శ్రీనివాసులు, అధ్యక్ష, కార్యదర్శులుగా ఉరాజ్, సందానీబాషా, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా ప్రసన్న కుమార్, పార్థసారథి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శ్రీనివాసరావు, రవీంద్రరాజు, కోశాధికారిగా గౌడ భాస్కర్, ఉపాధ్యక్షులుగా రాజ్‌కుమార్, రవివందన్, కామాక్షయ్య, సహాయ కార్యదర్శులుగా రీటా, తిరుపతి, జబ్బార్, కార్యవర్గ సభ్యులుగా కుమార్, అనీష్, అస్లామ్, వెంకటేశ్వర్లు, సునీతమ్మ, సావిత్రి, తిరుమలేష్, వెంకటరత్నం ఎన్నికయ్యారు.



పెంచలనరసింహాన్ని సత్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

గిట్టుబాటు ధర కల్పనే లక్ష్యం

- జేసీ కార్తీక్

నెల్లూరు రూరల్: ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని జేసీ కార్తీక్ సూచించారు. ధాన్యం కొనుగోలు విషయమై అధికారులు, వ్యాపారులు, రైస్ మిల్లర్లకు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని ఆదేశించారు. మండలానికో కమిటీ ఏర్పాటు చేయాలని, ఇందులో సివిల్ సప్లయ్స్, వ్యవసాయ, పోలీస్ శాఖల నుంచి ఒకర్ని నియమించాలని సూచించారు. పుట్టికి ప్రస్తుతం రూ.16,800 గిట్టుబాటు ధర లభిస్తోందని, దీనికి కట్టుబడి ఉంటామన్నారు.

30 శాతం కోతలు పూర్తి

జిల్లాలో వరికోతలు ప్రస్తుతానికి 30 శాతం పూర్తయ్యాయని రైతు సంఘ నేతలు తెలిపారు. పుట్టిని దళారులు, మిల్లర్లు రూ.16 వేలకు కొనుగోలు చేస్తున్నారని, అదే పక్క రాష్ట్రాల నుంచి వస్తున్న వారు రూ.16,700 మేర అందజేస్తున్నారని చెప్పారు. అయితే వీరు రైతుల వద్దకు రాకుండా రాజుపాళెంలోని ఏజెంట్లను పంపించి స్థానిక దళారులు ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నారని వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.19,720 మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేసే వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. గంగపట్నం రమణయ్య, షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో కార్తీక్

ఎంపీడీఓ కార్యాలయంలో తనిఖీ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు ఎంపీడీఓ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. మండల పరిషత్ లావాదేవాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యాలయ సిబ్బంది సమయపాలనను పాటించాలని కోరారు. నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్వచ్ఛభారత్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.కోటి వరకు మండల పరిషత్‌కు వచ్చే అవకాశం ఉన్న తరుణంలో ప్రాధాన్య క్రమంలో ఖర్చు చేయాలని పేర్కొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న మోహన్‌రావు

పొదలకూరు నిమ్మ ధరలు

పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.15



బావిలో దూకి వృద్ధురాలి బలవన్మరణం

వెంకటాచలం: బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ గొట్లపాళెంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రమణమ్మ (65) ఇంట్లో కనిపించకపోవడంతో గాలింపు చర్యలను కుటుంబసభ్యులు చేపట్టారు. కొద్దిసేపటికి నివాస సమీపంలోని బావిలో తేలడంతో వెంటనే బయటకు తీసి చూడగా, అప్పటికే ఆమె మృతి చెంది ఉన్నారు. అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలుస్తోంది.

ఐఎఫ్‌ఎస్ అధికారిపై భార్య ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): తన భర్త, ఐఎఫ్‌ఎస్ అధికారి బుడిగి శ్రీనివాసులురెడ్డి నుంచి తనకు, పిల్లలకు రక్షణ కల్పించాలని మహిళా పోలీసులను భార్య రేణుక శనివారం కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శ్రీనివాసులురెడ్డితో తనకు 2013లో వివాహమైందని, అప్పటికే రెండు పెళ్లిళ్లయిన విషయాన్ని దాచిపెట్టి మూడో వివాహం చేసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం తమకు ఇద్దరు పిల్లలున్నారని, అయితే తనను వదిలించుకొని మరో వివాహానికి కొంతకాలంగా ఆయన యత్నిస్తున్నారని ఆరోపించారు. కుమారుడికి జ్వరంగా ఉండటంతో ఆస్పత్రికి శుక్రవారం సాయంత్రం తీసుకెళ్లొచ్చేసరికి భర్త, కుటుంబసభ్యులు ఇంటికి తాళమేసి లోపలికి రానీయకపోవడంతో రాత్రంతా పిల్లలతో కలిసి బయటే ఉన్నానని చెప్పారు. మరో వివాహానికి యత్నిస్తున్న తన భర్తపై సీఎం, డిప్యూటీ సీఎం చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావుకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చొరవ చూపి తిరిగి ఇంట్లోకి వెళ్లేలా చర్యలు చేపట్టారు. కాగా ఈ విషయమై డీఎస్పీని సంప్రదించగా, గతంలోనే భర్తపై ఫిర్యాదు చేశారని, కోర్టులో కేసు నడుస్తోందన్నారు. ప్రస్తుత ఫిర్యాదుపై న్యాయ సలహాను తీసుకుంటున్నామని బదులిచ్చారు.

కండలేరులో 40.9 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారానికి 40.9 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల నుంచి కండలేరుకు 9900 క్యూసెక్కుల ప్రవాహం వస్తోందని చెప్పారు. కండలేరు నుంచి సత్యసాయి గంగకు 900, పిన్నేరుకు 20, లోలెవల్‌కు 40, హైలెవల్‌కు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.



మండల సర్వసభ్య సమావేశం రసాభాస



సభ్యులు, టీడీపీ నేతల మధ్య వాగ్వాదం



వైస్ ఎంపీపీతో మాట్లాడుతున్న ఎస్సై హనీఫ్

- టీడీపీ నేతలు చొచ్చుకురావడంతో ఉద్రిక్తత
- అరుపులు, కేకలతో గందరగోళం
- సభ్యులు, నాయకుల మధ్య వాగ్వాదం
- పోలీస్ బందోబస్తుతో ముగిసిన సభ

పొదలకూరు: మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా శనివారం మారింది. టీడీపీకి చెందిన కొందరు నేతలు కలగజేసుకొని సభలోకి రావడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. సభ్యులు, నేతల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్సై హనీఫ్.. సమావేశం వద్దకొచ్చి బందోబస్తును నిర్వహించడంతో సభను ఎంపీపీ సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి యథావిధిగా నిర్వహించారు.

జరిగిందిదీ..

సొసైటీ చైర్మన్‌గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన టీడీపీ మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు ప్రొటోకాల్ మేరకు సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఆయనతో పాటు కొందరు నేతలు హాజరై బయటే ఉన్నారు. సభ ప్రారంభమయ్యాక అధికారుల గైర్హాజరుపై పొదలకూరు బిట్ – 4 ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు ప్రశ్నలేవనెత్తారు. దీంతో మస్తాన్ బాబు.. శ్రీనివాసులు మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతో బయటున్న టీడీపీ నేతలు సభలోకి చొచ్చుకొచ్చి, సభ్యులతో వాగ్వాదానికి దిగారు. ఫలితంగా అరుపులు, కేకలతో గందరగోళం నెలకొంది. సభలోనే ఉన్న కొందరు సభ్యులు, వైస్ ఎంపీపీ సర్దిచెప్పడంతో వారు వెళ్లిపోయారు. దీంతో హాజరైన అధికారులతో సమీక్షను నిర్వహించారు. కొద్దిసేపటి తర్వాత సభా హక్కులు, నియమ నిబంధనలపై దుగ్గుంట ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి మాట్లాడటంతో సొసైటీ చైర్మన్, వైస్ ఎంపీపీ, సభ్యుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం నెలకొంది. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరం వద్దకు ఎస్సై వచ్చి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును నిర్వహించారు.

దాడికి యత్నించారు

సభలోకి ఇతరులు ప్రవేశించి తనపై దాడికి యత్నించారని పొదలకూరు బిట్ – 4 ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు ఆరోపించారు. అధికారులతో తానెప్పుడూ గౌరవంగానే మాట్లాడతానని, అయితే రెండు, మూడు సమావేశాలకు వీరు సక్రమంగా హాజరుకాకపోవడంతో సభ దృష్టికి తీసుకురావాల్సి వచ్చిందన్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు సభలోకి చొచ్చుకురావాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.